క్లుప్తంగా

సహస్ర దీపోత్సవం దేదీప్యం



అచ్చంపేట: మండలంలోని చల్లగరిగలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్తిక దామోదర సహస్ర దీపోత్సవానికి అశేష భక్త జనవాహిని తరలి వచ్చింది. దేవాలయ అర్చకస్వాములు వేదాంతం పవన్‌కుమార్ ఆచార్యులు, రెంటాల సత్యనారాయణ సహస్ర దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. వేంకటేశ్వరస్వామి శంఖు, చక్రాలు, నామాలు, శివలింగాకృతితో ప్రమిదలలో దీపాలు దేదీప్యమానంగా వెలిగించారు. ప్రముఖ ప్రవచకులు నందిపాటి రవీంద్రకుమార్ కార్తీక మాసం, దీపోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు దేవరశెట్టి శ్రీనివాసరావు వ్యాఖ్యానం చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దు

తహసీల్దార్ కె.నగేష్



గురజాల : విధి నిర్వహణలో బీఎల్‌వోలు అలసత్వం వహించవద్దని తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా పలు పోలింగ్ బూత్‌లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం-6 18, ఫారం-7 4, ఫారం-8 21 వచ్చినట్లు తెలిపారు. మొత్తం 43 దరఖాస్తులు బీఎల్‌వోలకు అందించినట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మాచవరం : మండల కేంద్రమైన మాచవరంలోని సచివాలయంలో శంకర్ కంటి ఆసుపత్రి అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా కళ్లజోళ్లను త్వరలోనే అందిస్తామని, శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తిక మాసంలో దీపాలు వెలిగించడం, ఆత్మజ్ఞానం అంశాలపై గ్రామస్తులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్.అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై.రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్ తదితరులున్నారు.

ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల


వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి సభ్యుని (ఎమ్మెల్సీ) ఎన్నికల కోసం నూతన ఓటర్ల ముసాయిదా జాబితాను ఆయన విడుదల చేసి నోటీస్ బోర్డులో ఉంచారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న గ్రాడ్యుయేట్ ఓటర్లు అంతా వివరాలను తప్పరిసరిగా పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే కార్యాలయం దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కె. సాయిబాబు తెలిపారు. మండలంలోని వంకాయలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కాటూరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో గుండె, గ్యాస్ట్రో, ఆర్థో, కిడ్నీ, ఈఎన్‌టీ, కంటి తదితర వ్యాధులకు సంబంధించిన వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందించారు. వైద్యులు కె. మాధవి, ఆంజనేయులు, బ్రాయాన్, అమూల్య, క్యాంప్ ఆర్గనైజర్ జె. నాగేంద్రబాబు, యూనిట్ ఇన్‌చార్జి ఎస్. శరత్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించండి

- పులిచింతల నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు
- రికార్డుల్లో ప్రభుత్వ భూములుగానే గుర్తింపు
- రిజిస్ట్రేషన్లు కాక హక్కు కోల్పోతున్న లబ్ధిదారులు
- జీఓ నం 586తో ఉచిత రిజిస్ట్రేషన్లకు పూనుకున్న గత ప్రభుత్వం
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిలిచిన ప్రక్రియ
- న్యాయం చేయాలంటున్న నిర్వాసితులు



రాజుపాలెం పులిచింతల నిర్వాసితుల కేంద్రం ఏరియల్ వ్యూ

రాజుపాలెం: పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులకు కష్టాలు తప్పడం లేదు. ప్రాజెక్టు నిర్మాణం తలపెట్టినప్పుడు ముంపు గ్రామాల వాసులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నష్ట పరిహారం చెల్లించింది ప్రభుత్వం. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి నిర్వాసిత కేంద్రాల్లో ఇంటి నిర్మాణం కోసం 0.5 సెంట్ల స్థలాన్ని తాత్కాలిక పట్టాతో ఇచ్చింది. ఆ స్థలంలో ప్యాకేజీ నగదు, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లను మంజూరు చేశారు.

దానికి కొంత సొంత నగదు వేసుకుని నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ, ఇది జరిగి 20 ఏళ్లు కావస్తున్న ఇప్పటికీ నిర్వాసిత ప్రాంతంలోని ప్లాట్లు.. ప్రభుత్వ స్థలాలుగానే మిగిలి పోయాయి.

ఆందోళనలో నిర్వాసితులు

మండలంలోని రెడ్డిగూడెం, రాజుపాలెం, చౌటపాపాయపాలెం, కొండమోడు గ్రామ పంచాయతీల పరిధిలో పులిచింతల ప్రాజెక్టు నిర్వాసిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముంపు గ్రామాలైన పులిచింతల, కోళ్లూరు, గొల్లపేట, చిట్యాల, చిట్యాల తండా, బోధనం, గోపాలపురాలకు చెందిన గ్రామాల వారికి ఇంటి స్థలాలు కేటాయించారు. ఆ ఇంటి ప్లాట్‌లు ఇప్పటికీ ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్ పత్రాలు లేవని బ్యాంకర్లు రుణాలు అధికారులు ఇవ్వడం లేదు. నిర్వాసితులు గత పదేళ్ల నుంచి ఉచిత రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ ఖర్చు భరించేలా జీఓ నంబరు 586 ద్వారా రూ.60కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో అధికారులు ఆగమేఘాల మీద ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన ప్లాట్‌ల రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. ఇప్పటి ప్రభుత్వం మరలా రిజిస్ట్రేషన్ చేయించాలని నిర్వాసితులు కోరుతున్నారు.



పూర్తయిన ఇంటి నిర్మాణం

నిర్వాసిత కేంద్రం	కేటాయించిన ప్లాట్లు	రిజిస్ట్రేషన్ అయినవి
రాజుపాలెం	354	214
రెడ్డిగూడెం	112	69
చౌటపాపాయపాలెం	1429	350
కొండమోడు	914	250

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి



గత ప్రభుత్వంలో ఇచ్చి జీవోను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించి, ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించాలి. రిజిస్ట్రేషన్ కానీ, లబ్ధిదారుల్లో ఒకింత ఆందోళన నెలకొంది. ఇక్కడికి వచ్చిన నిర్వాసితులందరూ జీవనోపాధి కోల్పోయి వలస కూలీలుగా జీవనం సాగిస్తున్నారు.

– ముళ్లా సుధాకర్, నిర్వాసితుడు

ప్రభుత్వ స్థలాలుగానే ఉన్నాయి



మేము సర్వం కోల్పోయాం. ఎన్నో ఏళ్ల నుంచి మా ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసి, ఇవ్వాలని ప్రభుత్వాలను కోరగా గత ప్రభుత్వం జీవో ఇచ్చింది. కొంత మంది ప్లాట్‌లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన వారికి కూడా న్యాయం చేయాలి.

– మెరుగు లక్ష్మణరావు, నిర్వాసితుడు

285 మందికి ఉచిత వైద్య పరీక్షలు



దొడ్లేరు(క్రోసూరు) : మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఆదివారం నరసారావుపేటకు చెందిన డాక్టర్ చెన్నారెడ్డి ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో 285 మంది వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సంతానం లేని పరీక్షలు, రూ.2 వేలు విలువచేసే ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ వసంతరాయ పాల్గొన్నారు. డాక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో అన్ని రకాల ట్రామా కేసులు, ఐయూఐ, ఐవీఎఫ్, ఐసీఎస్ఐ వైద్య పరీక్షలు, వైద్యం అందించనున్నట్లు తెలిపారు. సయ్యద్ మస్తాన్‌వలి, మాజీ సర్పంచ్ అల్లాభక్షు, పీఆర్వోలు రాజు, కేఎల్‌బీశాస్త్రి పాల్గొన్నారు.

బ్రాహ్మణ వన సమారాధన

సత్తెనపల్లి: పట్టణంలోని సత్య ధ్యాన మందిరంలో పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం, మందిర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 24వ బ్రాహ్మణ కార్తిక సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సభాధ్యక్షుడు గోపరాజు విజయరామారావు ఆధ్వర్యంలో పలువురు సంఘ పెద్దలను సత్కరించారు.

డ్వాక్రా మహిళల సమస్యలపై విచారణ జరిపిస్తాం

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గంలోని వెలుగు సంస్థలో డ్వాక్రా మహిళల సమస్యలపైన విచారణ జరిపించి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళల సమస్యలపై ఆయన మాట్లాడారు. అమరావతి, అచ్చంపేట మండలాల్లో డ్వాక్రా గ్రూపులలో ఆర్థిక లావాదేవీల్లో అనేక ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటిపై ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరిపించి, బాధిత మహిళలకు న్యాయం చేస్తామన్నారు. గ్రూపుల లావాదేవీలు విధివిధానాల ప్రకారం నిర్వహించేలా చూసుకోవాలని, వెలుగు కార్యాలయం అధికారుల దృష్టికి తీసువచ్చి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం కె.హనుమనాయక్, స్త్రీనిధి ఏజీఎం చిన్న బుల్లయ్య, ఏపీఎం సుబ్బారావు, నాగూర్ మీరావలి, కృష్ణ ప్రియ డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ముదిరాజుల కార్తిక వన సమారాధన

దాచేపల్లి : నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో పల్నాడు ప్రాంత ముదిరాజుల 6వ కార్తిక వనసమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పల్నాడు ప్రాంతంలోని వివిధ ప్రాంతాల నుంచి ముదిరాజులు భారీగా తరలివచ్చారు. ముదిరాజుల కులదైవానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు ముదిరాజుల నాయకులు వారి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ముదిరాజులు ఐకమత్యంగా ఉండాలని కోరారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం ముదిరాజుల కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముదిరాజులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన చెప్పారు. కార్తిక వనసమారాధనలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షుడు యల్లబోయిన రామకోటయ్య, ఉపాధ్యక్షుడు బొడ్డు నరసింహారావు, కార్యదర్శి గుర్రం నరసింహారావు, గౌరవ అధ్యక్షుడు నార్ల కాశయ్య, యూత్ ప్రెసిడెంట్ గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు జాలెబోయిన పాపారావు, కొరటా మల్లిఖార్జునరావు, సిట్టిటి రాజేంద్రప్రసాద్, మేడబోయిన నరసింహారావు, బొడ్డు సాయికుమార్ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ముదిరాజుల నాయకులు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన

నరసరావుపేట: ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ రంగంలో స్మార్టు మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ కూటమి నాయకులు ఇప్పుడు అధికారంలో ఉండి వాటిని ఏర్పాటు చేయటం ప్రజలను వంచించటమే అవుతుందని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు అన్నారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో స్మార్టు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ వాల్‌పోస్టర్లు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయటమంటే ప్రజల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలుచేయటమేనని విమర్శించారు. ఆదానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించడాన్ని తీవ్రంగా ఖండించారు. సెల్లు లాగా కరెంటు రీచార్జ్ చేసుకునే విధానం చాలా ప్రమాదమని, అర్ధరాత్రి అయిపోతే కరెంట్ అగిపోయే పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. ప్రమాదకరమైన వ్యాపార ధోరని కలిగిన రీచార్జింగ్ విధానాన్ని (స్మార్ట్ మీటర్ల) ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ప్రదర్శిస్తున్న పీడీఎం నాయకులు

అవయవ దానానికి ముందుకురావాలి

నరసరావుపేట: సమాజంలో అవయవ, శరీర దానం అంటే తప్పు అనే మూఢ నమ్మకాలను వదిలేసి అవి దానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని 'అమ్మ నేత్ర-శరీర, అవయవ దాన ప్రోత్సాహకుల సంఘం సొసైటీ' ఉమ్మడి గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్. చలపతిరావు కోరారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నేత్ర శరీర, అవయవ దాన కమిటీ సమావేశానికి పల్నాడు విజ్ఞాన కేంద్రం నేత్ర, అవయవ దాన సబ్ కమిటీ కన్వీనర్ కె.రామబ్రహ్మం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలలో విరివిగా ప్రచారం చేయాలని తెలిపారు. వైద్య విద్యార్థులకు ప్రయోగాల కోసం మృతదేహాల కొరత ఉండడంతో బొమ్మలతో చేస్తున్నారన్నారు. శరీర అవయవ దానం చేయదలిచిన వారు 94920 81140లో సంప్రదించాలని కోరారు. ముందుగా ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయకపోయినా కుటుంబ సభ్యుల రాత పూర్వక అనుమతితో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కమిటీ సభ్యులు కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నేత్ర, శరీర అవయవదానాలపై బాధ్యతాయుతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. రామబ్రహ్మం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శరీరదాన ఉద్యమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. శరీర అవయవ దానం కంటే పెద్ద దానం మరొకటి లేదని తెలిపారు. అవయవ దానం చేయడం ద్వారా మరణించినా జీవించినట్లేనని చెప్పారు. కార్యక్రమంలో సంఘం కో-ఆర్డినేటర్ మహమ్మద్ రఫీ, కమిటీ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, కామినేని రామారావు, కోయ రామరావు, ఎం.అంకారావు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.



అనుమతి పత్రాలు ప్రదర్శిస్తున్న దాతలు

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

శావల్యాపురం: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సంఘం కమిటీ సభ్యుడు రెడ్డి కృష్ణ సూచించారు. ఆదివారం మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలో గల అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి సన్నిధిలోని ఆర్యవైశ్య సత్రంలో 14వ కార్తిక వనసమారాధన నిర్వహించారు. తొలిత వాసవీ అమ్మవారు, పొట్టి శ్రీరాములు, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. కొల్లిపర శ్రీనివాసరావు, పద్మనాభుని హనుమంతరావు గట్టుపల్లి సత్యనారాయణ, వీరాస్వామి, రెడ్డి జ్వాలా నరసింహారావు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు

నకరికల్లు: మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో సాగు చేస్తున్న పంటల డిమాండ్ దృష్ట్యా ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. ఆయా గ్రామాల రైతులు సేవ సిబ్బందిని కలసి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు హాజరు ఓటరు నమోదు పై అర్జీలు స్వీకరించారు. ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, గోళ్ళపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు పరిశీలించారు.

ఘనంగా కాపు వన సమారాధన

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారి పాలెంలోని జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో కాపు సంఘీయుల కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పాల్గొని, జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శిరిగిరి వెంకట్రావు, అన్నదాసు వెంకటస్వామి, నాము శివ, దేవిశెట్టి కోటేశ్వరరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారి పాలెం నుంచి లంకెలకూరపాడు వెళ్లే దారిలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.2,910 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు వలంటీర్ల ధర్నా

నరసరావుపేట: గ్రామ, వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం ఉదయం 10గంటలకు రైల్వే స్టేషన్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, అక్కడే ధర్నా నిర్వహిస్తున్నట్లు గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయిన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా ఉన్న జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. బలవంతంగా రాజీనామా చేసిన వారిని తిరిగి మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని, వారికి రూ.10వేలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జాబ్ చార్ట్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మోకాళ్ల ఆపరేషన్



చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పల్నాడు హాస్పటల్ ఆధ్వర్యంలో హ్యాపీ నీడ్స్ కార్యక్రమాన్ని 2025 జనవరి 1 నుంచి ప్రారంభిస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా పేదలకు ఉచిత మోకాళ్ల ఆపరేషన్లు నిర్వహించటం జరుగుతుందని చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పల్నాడు హాస్పటల్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్, పల్నాడు హాస్పటల్ సంయుక్తంగా హ్యాపీ నీడ్స్ కార్యక్రమంలో పేదలకు మోకాళ్ల ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించబోతున్నామన్నారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారయినా ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇంప్లాంట్ కాస్ట్ పేషెంట్ భరించాల్సి వస్తుందని, మందులు, ఆపరేషన్, హాస్పటల్ చార్జీలు ట్రస్ట్, పల్నాడు హాస్పటల్ అందించటం జరుగుతుందన్నారు. ఈ సౌకర్యాలను పొందాలని ఆయన పేర్కొన్నారు.

కుల గణనతోనే బీసీల అభివృద్ధి

అచ్చంపేట: బీసీ కులాలు అభివృద్ధి చెందాలంటే ఖచ్చితంగా బీసీ కుల గణన చేపట్టాల్సిందేనని ఏపీ బీసీ సంక్షేమ సంఘ అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను డిమాండ్ చేశారు. స్థానిక బీసీ కాలనీలోని అంకమ్మతల్లి దేవాలయంలో ఆదివారం పెదకూరపాడు నియోజవర్గ బీసీ సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. శ్రీను ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు పడకండ్ల లక్ష్మాచారి అధ్యక్షత వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపు మేరకు ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే బీసీల ధర్నాకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. దేశ జనాభాలో సగానికి పైగా బీసీలున్నారని, కానీ ఏ రంగంలోనూ బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. పడగండ్ల లక్ష్మాచారి, కోనంగి గురునాథం, ముసుగు సాంబశివరావు, బత్తుల కోటేశవరరావు, పరిమి గురునాథం, వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాదుగున్నల శ్రీను

వడియ రాజుల కార్తిక వన సమారాధన

సత్తెనపల్లి: వడ్డెరులు ఐక్యంగా అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. బీమవరం గ్రామంలోని కాటి అంకమ్మతల్లి దేవస్థానంలో వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి ఆధ్వర్యంలో కార్తిక మాస వన భోజన కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొని, మాట్లాడారు. వడ్డెర కులస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉసిరి మొక్కలు నాటారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు మాట్లాడారు. సంఘం నాయకులు కొమెర వీరాంజనేయులు, గుంజి విజయ్‌కుమార్, ఒంటిపులి మల్లీశ్వరి, ఓర్సు వెంకటపతి, వేముల బేబీరాణి, కొమెర వెంకటేశ్వర్లు, దేవళ్ళ మల్లిఖార్జునరావు, చల్లా పిచ్చయ్య, ఓర్సు శ్రీహరి, ఒంటిపులి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏసురత్నం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

నరసరావుపేట: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ తెలిపారు. కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్-హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఆంజనేయనాయక్ మాట్లాడుతూ జిల్లాలో రాజకీయ వేధింపులతో 15 మందికి పైగా అంగన్‌వాడీలతో బలవంతపు రాజీనామాలు చేయించారని, పలువురిపై దాడులు చోటుచేసుకున్నాయని తెలిపారు. రాజీనామా చేయకుండా ధైర్యంగా విధులు నిర్వహిస్తున్న వారి కుటుంబ సభ్యులకు హాని చేస్తామని, పొలం గట్ల దగ్గర రకరకాలుగా వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వేధింపులు ఆపకపోతే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి మాట్లాడుతూ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరారు. మినీ వర్కర్లకు వేసవి సెలవులు, ఖాళీ పోస్టుల్లో పదోన్నతులు, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలన కోరారు. గ్రేడ్ -2 సూపర్‌వైజర్ పోస్టులకు మినీ వర్కర్లకు అవకాశం కల్పించాలని, 42 రోజుల సమ్మె మినిట్స్ కాపీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తూ చనిపోయిన వారికి మట్టి ఖర్చుల జీఓ వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిర్మల, ప్రసన్న, సాయి కుమారి, సుజాత, సావిత్రి, జయలక్ష్మి , ధనలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయ నాయక్

ఉద్యోగోన్నతులు ద్వారా ఖాళీలు భర్తీ చేయాలి

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులను వెంటనే చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. రామిరెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలో 22వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చూపారని తెలిపారు. అయితే, ప్రభుత్వం మాత్రం 16,347 పోస్టలకు మాత్రమే డీఎస్సీ ప్రకటన చేసిందన్నారు. మిగిలిన 6వేలకు పైగా పోస్టులు ఎందుకు ఖాళీగా ఉంచాలని ప్రశ్నించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.కోటేశ్వరరావు, ఎస్.ఎం.సుభాని, జె.గంగాధరబాబు పాల్గొన్నారు.